AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND


www.aksharatoday.in

24-10-2025 (Friday) MAIN EDITION

## డిగ్రీతో ఇంటెలిజెన్స్ బ్యూరోలో ఉద్యోగావకాశాలు

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్ 2/టెక్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలైంది. డిగ్రీ అర్హతతో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం 258 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా పీజీ డిగ్రీ ఉత్తీర్ణత సాధించినవారు అర్హులు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ https://www.mha.gov.in/enలో సంప్రదించవచ్చు.

## బీహార్‌లో ఎన్డీఏదే విజయం: ప్రధాని మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్‌లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. సమస్తీపూర్ జిల్లా కర్పూరీ గ్రామంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. యువతకు సాధికారత కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. నితీష్ కుమార్ అధికారం చేపట్టిన తర్వాత 2005 అక్టోబర్‌లో రాష్ట్రం 'జంగల్ రాజ్' నుంచి విముక్తి పొందిందని మోదీ అన్నారు. నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్డీఏ గత రికార్డులను చెరిపేస్తూ భారీ విజయం సాధిస్తుందని ఆయన అన్నారు.

## ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఓ కారు దగ్ధమైంది. సిద్దిపేట నుంచి శంకర్‌పల్లి వివాహ వేడుకకు ఓ కుటుంబం కారులో బయలు దేరింది. వారి కారు ఓఆర్ఆర్ మీదుగా వెళ్తుండగా.. పటాన్‌చెరు సమీపంలో మంటలు అంటుకున్నాయి. గమనించిన కారులోని కుటుంబం కిందకు దిగడంతో ఎలాంటి గాయాలు కాలేదు.

## పాకిస్థాన్‌లో కిలో టమోటాలు రూ.600



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ మధ్య ఇటీవల ఉద్రిక్తతలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో అక్టోబర్ 11 నుంచి రెండు దేశాల సరిహద్దులను మూసివేశారు. దీంతో ఆ దేశాల్లో నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయి. కిలో టమోటాలు ఏకంగా 600 పాకిస్థానీ రూపాయలకు చేరడం గమనార్హం.

## జీహెచ్ఎంసీ పార్క్‌కు సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్‌లో నిర్మాణంలో ఉన్న జీహెచ్ఎంసీ పార్కును సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. చెత్తా చెదారంతో నిండి ఉన్న ఈ ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా పార్కు నిర్మించాలని గతంలో ఆయన ఆదేశించారు. దీంతో జీహెచ్ఎంసీ పనులు చేపడుతోంది. కాగా.. ఆయన పార్కును సందర్శించి, కూలీలతో మాట్లాడారు.

## జూబ్లీహిల్స్ బరిలో 58 మంది

**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు 23 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 58 మంది నిలిచారు. కాగా ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి చాలా మంది నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. మొత్తం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు వేశారు. ఇందులో 186 రిజెక్ట్ అయ్యాయి. దీంతో 81 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. అందులో నుంచి 23 మంది నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 58 మంది ఉండనున్నారు.

## సినీ కార్మికుల సమస్యలపై సమావేశం

**అక్షరటుడే, హైదరాబాద్ :** సినీ కార్మికుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం వేసిన కమిటీ తొలి సమావేశం నిర్వహించింది. కార్మిక శాఖ కమిషనర్ దాన కిశోర్ ఛైర్మన్‌గా కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో శుక్రవారం కమిటీ సమావేశం అయింది. అడిషనల్ కమిషనర్ గంగాధర్ సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# డెత్ జర్నీ

- కర్నూల్ జిల్లాలో కాలిపోయిన ట్రావెల్స్ బస్సు
- 20 మంది సజీవ దహనం
- బస్సు, బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం
- రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

**బస్సులో ప్రయాణిస్తున్న వారికి అదే చివరి జర్నీ అయింది. ప్రయాణికులు గాఢనిద్రలో ఉండగా బస్సులో మంటలు వ్యాపించాయి. ఏం జరుగుతుందో తెలిసేలోపే 20 మంది సజీవ దహనం అయ్యారు. పలువురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమురి కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు కర్నూల్ జిల్లా చిన్నటేకూరు సమీపంలో అగ్ని ప్రమాదానికి గురైంది. బైక్‌ను బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ బస్సు కిందకు వెళ్లిన సమయంలో స్పార్క్స్ వచ్చి మంటలు వ్యాపించాయి.**

– అక్షరటుడే, హైదరాబాద్

వేమురి కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలు దేరింది. తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో కర్నూలు జిల్లా శివారులో ఉన్న చిన్నటేకూరుకు చేరుకుంది. ఆ సమయంలో బస్సు రాంగ్‌రూట్‌లో వచ్చిన బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి బస్సు అంతా వ్యాపించాయి. క్షణాల్లో బస్సు కాలిబూడిదైంది. ప్రయాణికులు ఆ సమయంలో నిద్రలో ఉండడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. పలువురు ఎమర్జెన్సీ డోర్, కిటికీల నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో 20 మంది సజీవ దహనం అయ్యారు. అధికారులు మృతదేహాలను వెలికి తీశారు.

### పలువురి సంతాపం

కర్నూల్ బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, మంత్రులు ఈ ఘటనపై స్పందించారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ, ఏపీ సీఎంలు ఆదేశించారు.

### హైదరాబాద్ వాసులే అధికం

ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తెచ్చి గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు పూర్తిగా దగ్ధమైపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందినవారని పోలీసులు తెలిపారు.

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

బస్సు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గొల్లవారిపల్లికి చెందిన గొల్ల రమేశ్ (35) తన కుటుంబంతో సహా హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్నాడు. ఈ ప్రమాదంలో రమేశ్‌తో పాటు ఆయన భార్య అనూష (30), పిల్లలు మన్విత(10), మనీశ్ (12) మృతి చెందారు. కాగా రమేశ్ 15 ఏళ్లుగా బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. కంపెనీ ట్రిప్పులో భాగంగా కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వచ్చాడు. తిరిగి వెళ్తుండగా ప్రమాదంలో కుటుంబం చనిపోయింది.

### దీపావళికి ఇంటికి వచ్చి..

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తకొండూరుకు చెందిన అనూష రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఆమె దీపావళి సందర్భంగా ఇంటికి వచ్చింది. పండుగ అయిపోవడంతో తిరిగి వెళ్తుండగా.. బస్సు ప్రమాదంలో మృతి చెందింది. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి(27) కూడా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కొలువు చేస్తోంది. హైదరాబాద్‌లో ఉండే మేనమామ దగ్గరికి వెళ్లిన ఆమె ట్రావెల్స్ బస్సు ఎక్కింది. ఆమె కూడా సజీవ దహనం అయింది.

### మృతుల కుటుంబాలకు పరిహారం

బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలు పరిహారం ప్రకటించాయి. రాష్ట్ర ప్రభుత్వం మృతులకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం మృతులకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున తక్షణ సాయం అందించనున్నట్లు తెలిపింది. కాగా.. ఏపీ ప్రభుత్వం సైతం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

### తనిఖీలు లేకపోవడంతోనే..

ప్రైవేట్ బస్సుల తనిఖీలు లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బస్సులను రోజూ తనిఖీ చేస్తుంటే ట్రావెల్స్ యజమానులు వేధింపులు అంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఏపీ రవాణా శాఖ మంత్రి, కర్నూలు కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ బస్సుల స్పీడ్ నియంత్రణ కోసం చర్యలు చేపడతామన్నారు.

## రేపు హస్తినకు సీఎం రేవంత్ రెడ్డి..




**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లనున్నారు. ఏఐసీసీ కార్యాలయంలో ఆయన అధిష్టానంతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షుల నియామకంపై సీఎం చర్చించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశంలో పాల్గొంటారు. రాష్ట్రంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల నియామకానికి ఇటీవల దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఏఐసీసీ పరిశీలకుల బృందం ఆయా జిల్లాల్లో పర్యటించి ఆశావహుల నుంచి దరఖాస్తులను తీసుకుంది. అనంతరం నివేదికను హైకమాండ్‌కు అందజేసింది. కాగా.. రాష్ట్రంలో డీసీసీ అధ్యక్ష పదవులను ఈ నెలాఖరులోగా భర్తీ చేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో ప్రధానంగా డీసీసీ అధ్యక్షుల నియామకంపై చర్చించనున్నారు. బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, జూబ్లీ ఉప ఎన్నికలపై కూడా హైకమాండ్ చర్చించే అవకాశం ఉంది. అలాగే ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై అధిష్టానం ఆరా తీయనున్నట్లు తెలిసింది.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు అవుతాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో శుక్రవారం తెలంగాణ నిరుద్యోగుల జేఏసీ నిర్వహించిన కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అన్నారు. రాజీవ్ యువ వికాసం ఎక్కడ అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించడానికి నిరుద్యోగులకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చక్కని అవకాశం అని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో ఓడిపోతే రేవంత్ రెడ్డి సీఎం పదవి పోదన్నారు. ఇంకా మూడేళ్లు ఆయన సీఎంగా ఉంటారని చెప్పారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ 20 ఏళ్ల వరకు అధికారంలోకి రాదని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులను కాంగ్రెస్ వాడుకుందన్నారు. ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్‌ను ఓడించడానికి నిరుద్యోగ యువత ముందుకు రావాలని కోరారు. ఆ పార్టీ ఓడిపోతేనే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు అవుతాయన్నారు. తన ప్రభుత్వ నిర్ణయాలపై సీఎం సమీక్షించుకుంటారని చెప్పారు.


## 4 సెకన్ల యాడ్‌తో స్టార్‌గా మారిన ఐష్..



**అందం, అభినయం, ఆకర్షణ.. ఈ మూడు గుణాలతో బాలీవుడ్‌ను కట్టిపడేసిన హీరోయిన్ ఐశ్వర్య రాయ్ బచ్చన్. చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే, ఆమెకి స్టార్‌డమ్ కేవలం 4 సెకన్ల యాడ్‌తో వచ్చింది. నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఐశ్వర్య, అప్పట్లో పలు యాడ్‌లలో నటించింది. అయితే 1993లో వచ్చిన ఒక పెప్సీ యాడ్ ఆమె కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఆ యాడ్‌లో అమీర్ ఖాన్‌తో కలిసి కేవలం నాలుగు సెకన్ల పాటు మాత్రమే కనిపించిన ఐశ్వర్య రాయ్, తన లుక్, ఎక్స్‌ప్రెషన్స్‌తో దేశం మొత్తం దృష్టిని ఆకర్షించింది. ఇటీవల ప్రముఖ నిర్మాత ప్రహ్లాద్ కక్కర్ ఒక ఇంటర్వ్యూలో ఆ సంఘటనను గుర్తుచేసుకున్నారు.**

- అక్షరటుడే, సినిమా డెస్క్

## మారుతి 'జిమ్నీ' అరుదైన రికార్డ్..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ జిమ్నీ అరుదైన రికార్డ్ సాధించింది. మారుతి సుజుకీ కంపెనీకి చెందిన జిమ్నీ 5 డోర్ మోడల్.. లాంచ్ అయినప్పటి నుంచి లక్ష యూనిట్ల మైలురాయిని అధిగమించింది. భారతదేశంలో తయారైన మారుతి సుజుకీ జిమ్నీ ఎగుమతులను కంపెనీ 2023లో ప్రారంభించింది. ప్రస్తుతం భారత్ నుంచి మెక్సికో, ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా, చిలీ సహా 100కుపైగా దేశాలకు ఈ మోడల్‌ను ఎగుమతి చేస్తోంది. 2025 జనవరిలో జిమ్నీ నోమేడ్ పేరుతో జపాన్‌లో ఈ కారును విడుదల చేసింది. ఈ మోడల్ అక్కడ ఎక్కువ ఆదరణ పొందింది. జపాన్‌లోనే 50 వేలకు పైగా ఆర్డర్లు వచ్చినట్లు కంపెనీ ప్రకటించింది. జిమ్నీ ప్రస్తుతం 6 వేరియంట్లు, 4 రంగుల్లో లభిస్తోంది. ఇది రూ. 12.31 లక్షల నుంచి లభ్యమవుతోంది.

## ఇద్దరు ఐసిస్ టెర్రరిస్టుల అరెస్ట్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రాజధానిలో ఉగ్రదాడికి కుట్ర పన్నిన ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లో ఒకరిని, సౌత్ ఢిల్లీలో మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. వారు ఐఈడీ బాంబులను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఢిల్లీలోని సాదిక్ నగర్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లలో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వీరికి ఐసిస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నట్లు చెప్పారు. ఢిల్లీలో ఒక పెద్ద ఉగ్రవాద దాడి చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆయుధాలు, పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితుల్లో ఒకరిని అద్నాన్‌గా పోలీసులు గుర్తించారు.